విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 27, ఆగస్టు 2023

ఎండిపోతున్న పంటలను కాపాడండి

- తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలి
- ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.చిన్నప్ప యాదవ్

ఆందోళన చేస్తున్న దృశ్యం

విశాలాంధ్ర–ఆత్మకూరు: ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 27వ తారీకు వరకు జిల్లా వ్యాప్తంగా ఎండిపోతున్న పంటలను రైతు సంఘం నాయకులు రైతులతో కలిసి పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా 28వ తారీఖున సోమవారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండల తహశీల్దార్ కార్యాలయాల దగ్గర ఆందోళనలు చేయనున్నారు. జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలన్న డిమాండ్‌లో భాగంగా శనివారం ఆత్మకూరు మండలం సనప గ్రామంలో ఎండిపోయిన పంట పొలాలను వేరుశనగ జొన్న తదితర పంటలను రైతు సంఘం, సిపిఐ నాయకులు కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నప్ప యాదవ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా దాదాపు 4 లక్షల హెక్టార్లలో వేరుశనగ, పత్తి ,కంది ,జొన్న, కొర్ర, ప్రొద్దుతిరుగుడు, సజ్జ, తదితర పంటలు సాగు చేయడం జరిగినది ఖరీఫ్‌లో వేరుశెనగ పంట వేసీ దాదాపుగా రెండు నెలలు కావస్తుంది.. వర్షం లేక వేసిన అన్ని రకాల పంటలు ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. వేరుశనగ 30 రోజుల్లోనే పూత దశ 45 రోజులకి ఊడ దశ చేరుకుంటుంది.. కానీ ఇప్పటికే 45 రోజులు దాటిపోయింది కానీ వర్షం లేక పూర్తిగా వేరుసెనగకూడా ఎండిపోయింది. దాని వల్ల ఎకరాకు 20 వేలు పై వరకు రైతులు వేరుశనగ పంటకు పెట్టి నష్టపోయామని రైతులు మా దృష్టికి తీసుకొచ్చారని, ఇతర పంటలు కూడా వర్షం లేక పూర్తిగా ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఎకరాకి రూ.25 వేలు నష్టపరిహారం చెల్లించాలని, సామూహిక స్ప్రింక్లర్లు ఏర్పాటు చేసి బోరుబావులున్న రైతులతో ఏండి పోతున్నపంట పొలాలకు నీరు ఇప్పించేటట్లుప్రభుత్వమే కార్యక్రమాలు చేపట్టాలి, ట్యాంకర్‌ల ద్వారా పంటలకు నీటిని ఉచితంగా, సప్లై చేయాలని కోరారు. లేకుంటే రైతులు వలసలు పాయే ప్రమాదం ఉందని, అప్పుల పాలై ఆత్మహత్య లు కూడా పాల్పడే ప్రమాదం ఉందన్నారు. అధికా రులు గ్రామాల్లో సమగ్రమైన సర్వే చేసి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం వచ్చేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సనప నీళ్లపాల రామకృష్ణ, సిపిఐ రాప్తాడు నియోజకవర్గం సహాయ కార్యదర్శి జి, శ్రీకాంత్, వ్యవసాయ కార్మిక సంఘం రాప్తాడు నియోజకవర్గం ఉపాధ్యక్షుడు బి.రామాంజనేయులు, రైతులు నాగేంద్ర, శైలజ , ఈశ్వరయ్య, తాతయ్య, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర–తాడిపత్రి: మండలంలోని చిన్నపల్లి, ఎర్రగుంటపల్లి, పెద్దపడమల గ్రామలలో రైతులు సాగుచేసి వర్షాలు రాక ఎండి పోతున్న పత్తి, కంది, వేరుశెనగ, ఉద్ది పంట పొలాలను శనివారం ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. చంద్రశేఖర్ రెడ్డి రైతుసంఘం మండల కార్యదర్శి జి. రాజారామి రెడ్డి రైతు నాయకులు యుగంధర్ లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ లో వర్షాలు రాక పంటలు సాగు చేసి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. సాగు చేసిన పంట కూడా జులై, ఆగస్టునెలలో వర్షాలు రాక పంటలు ఎండి పోతున్నాయి. కావున ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించి ప్రభుత్వం ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కమిటి సభ్యులు శిరీషా రైతులు సూర్యనారాయణ యాదవ్ ఆది నారాయణ, లక్ష్మి రెడ్డి, శేఖర్, మల్లికార్జున, శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల బాధలు పాలక ప్రభుత్వాలకు పట్టదా!

- నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి
- ఎండిపోతున్న పంటలను ట్యాంకర్లతో తడపండి
- తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలి...
- ఏపీ రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్ర–శింగనమల: ఖరీఫ్ సీజన్లో జిల్లా వ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల వేరుశనగ, కంది, సజ్జ, జొన్న పత్తి, పెసర, అలసంద, తదితర పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయని, రైతులు ఇంత బాధ పడుతున్నా ప్రభుత్వానికి పట్టదా అని ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిరుతల మల్లికార్జున, సిపిఐశింగన మల నియోజకవర్గ కార్యదర్శి టి.నారాయణ స్వామి, సిపిఐ రాప్తాడు నియోజకవర్గం కార్యదర్శి రామకృష్ణ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండి రామకృష్ణ, ఏపీరైతు సంఘం నియోజకవర్గం కార్యదర్శి రాముల ధ్వజమెత్తారు. శనివారం బుక్కరాయ సముద్రం మండలం సిద్దలాపురం గ్రామ రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిరుతల మల్లికార్జున మాట్లాడుతూ అనంతపురం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతులను ప్రభుత్వమే పూర్తిగా ఆదుకోవాలని, లేకపోతే ఆత్మహత్యలకు పాల్పడే అవకాశాలున్నాయన్నారు. ఎండి పోయిన పంట పొలాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి కాపాడాలని, రైతులకు నాణ్యమైన విద్యుత్ నుతొమ్మిదిగంటలు సక్రమంగా అందించాలని డిమాండ్ చేశారు. ఈనెల 28వ తారీఖున సోమవారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండల తహశీల్దార్ కార్యాలయాల దగ్గర నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 4 లక్షల హెక్టార్లలో వేరుశనగ, పత్తి, కంది, జొన్న, కొర్ర, ప్రొద్దుతిరు గుడు, సజ్జ, తదితర పంటలు సాగు చేషశారని, ఖరీఫ్ లో వేరుశెనగ పంట వేసీ దాదాపుగా రెండు నెలలు పూర్తయిందని, పంటలు వేసినప్పటి నుండి వరుణుడు కరుణించక పోవడంతో వేసిన పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయని, వేరుశనగ 30 రోజుల్లోనే పూత దశకు వస్తుందని, 45 రోజులకి ఊడ దశకు చేరు కుంటుందన్నారు. రైతులు వేరుశనగ పంటకు ఎకరాకి 25 వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించి కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు, కార్యక్రమంలో నాయకులు, పూజారి కిష్ట, నరేష్ ,ఉజ్జినప్ప, చంద్ర, నారప్ప, సత్తిరెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కుల మతాలకు అతీతంగా పథకాలు

- ప్రజా సంక్షేమ యాత్రలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

విశాలాంధ్ర–యాడికి: కుల ,మత , పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేపట్టిన ప్రజా సంక్షేమ యాత్ర నల్గొవ విడతలో భాగంగా ఐదవ రోజు శనివారం యాత్ర నగరూరు మీదగా ప్రారంభించి భోగలకట్ట తూట్రాల పల్లి,రామారాజుపల్లి మీదుగా రాయల చెరువు వరకు యాత్ర సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెద్దారెడ్డి మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగన్మోహన్ రెడ్డి నవరత్నాల లాంటి పథకాలు అర్హులైన ప్రతిఒక్క లబ్ధిదారునికి అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో యాడికి వైసిపి మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, మాజీ జెడ్పిటిసి వెన్నపూస వెంకటరామిరెడ్డి, నగరూరు బ్రహ్మానందరెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు బాల రమేష్ బాబు, యాడికి ఉప సర్పంచ్ కాసా చంద్రమోహన్, తలారి నగేష్, పలువురు వైసిపి నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బార్ అండ్ రెస్టారెంట్‌ను మూసివేయాలి

విశాలాంధ్ర–ఉరవకొండ: ఉరవకొండ పట్టణంలోని గుంతకల్లు రోడ్‌లో జనవాసాలు మధ్య నిర్వహిస్తున్న భవాని బార్ అండ్ రెస్టారెంట్‌ను తక్షణమే మూసివేయాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఉరవకొండలో వారు విలేకరులతో మాట్లాడుతూ రెస్టారెంట్ ను జననివాసాల, స్కూళ్లో, ఆసుపత్రి, బ్యాంకులు, మరియు మీ సేవ కేంద్రాలతొ నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో నిర్వహించడం ఎంత మాత్రం కూడా తగదన్నారు. ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థులు అదేవిధంగా యువత మద్యానికి బానిసై భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని మద్యం తాగి బైక్ రైడింగ్‌లు చేస్తూ యువత ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జివిఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి పురుషోత్తం, ఏఐఎస్ఎఫ్ నాయకులు చిరంజీవి, అనిల్ కుమార్, ఆర్ఎస్‌యు జిల్లా అధ్యక్షులు భీమేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు గణేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు సింహాద్రి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మురడి ఆంజనేయ స్వామిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ కాపు

విశాలాంధ్ర–డి.హీరేహాల్: మండలం పరిధిలో ప్రసిద్ధి గాంచిన మురిడి ఆంజినేయస్వామి వారిని శ్రావణ మాసం రెండో శనివారం శుభ సందర్భంగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్ పర్సన్ కాపు భారతి, వైయస్సార్సీపి యువ నాయకులు కాపు ప్రవీణ్ రెడ్డి, వారి కుటుంబం సమేతంగా దర్శించుకున్నారు. ఏపిఐఐసి ఛైర్మెన్ మెట్టుగోవింద్‌రెడ్డి తనయుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి దంపతులు కూడా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ ఎం. వన్నూరస్వామి, జిల్లా వైసిపి ఉపాధ్యక్షుడు రాళ్ల తిమ్మరెడ్డి, సర్పంచులు శ్రీనివాసులు రెడ్డి, నాగరాజు, ఎంపీటీసీ కల్యం సురేష్, వైసిపి నాయకులు గొల్ల సురేష్,నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా కంటి అద్దాల పంపిణీ

విశాలాంధ్ర–తాడిపత్రి: పెద్దపప్పూరు మండలంలోని పీహెచ్సీలో శనివారము జిపియంవోవో మధు సూదనరాజు ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సివిల్ సర్జన్ డా.సైదన్న ఆదేశాల మేరకు వైద్యాధికారి డా. ఉషారాణి చేతుల మీదుగా దాదాపు 190 మంది వృద్ధులకు ఉచిత కంటి అద్దాలు అందజేశారు. అలాగే నేత్ర ఆరోగ్య సంరక్షణ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ షర్మాన్ వలి, లక్ష్మికుమారి, సీహెచ్వో భారతి సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడిపై ఫోక్సో కేసు నమోదు

విశాలాంధ్ర–బొమ్మనహాళ్: కనేకల్లు మండలం 43 ఉడేగోళం గ్రామానికి చెందిన మహేష్ అనే యువకుడుపై బొమ్మనహాల్ పోలీస్‌స్టేషన్లో ఫోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ శనివారం విలేకరులకు తెలిపారు. బొమ్మనహాల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలికను పెళ్లి చేసుకుంటానని మాయమాటలతో తీసుకెళ్లాడని బాలిక కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు పోక్సో కేసు నమోదు చేసి ఆ యువకుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విశాలాక్షి ఖాదీ సిల్క్ ప్రారంభోత్సంలో ప్రముఖులు

విశాలాంధ్ర–యాడికి: మండల కేంద్రంలోని గవర్నమెంట్ ఆసుపత్రి ఎదుట నూతన విశాలాక్షి ఖాదీ సిల్క్ గ్రామీణ సంస్థ ప్రారంభోత్సవానికి తాడిపత్రి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జేసి అస్మిత్ రెడ్డి హాజరయ్యారు. మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య క్లాస్ 1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్ రెడ్డి టిడిపి మండల కన్వీనర్ గోర్తి రుద్రమ నాయుడు, తెలుగు యూత్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ పరిమి చరణ్ హాజరై ఖాదీ సిల్క్ యజమాని నారాయణ స్వామికి అభినందనలు తెలిపారు.

కర్ణాటకలో హెచ్‌ఎల్‌సి కెనాల్‌కు గండి

వృధాగా పారుతున్న నీరు

విశాలాంధ్ర–బొమ్మనహాల్: కర్ణాటకలోనే బళ్లారి జిల్లా కోళగల్లు సమీపంలోని తుంగభద్ర కుడికాలువ (హెచ్ఎల్‌సి) 78వ కిలోమీటరు సమీపంలో శనివారం వేకువ జామున గండి పడింది. దీంతో కాలువలో ప్రవహించే నీటి పరిమాణం సగానికి సగం తగ్గిపోయింది. గత రాత్రి 10 గంటల సమయంలో రైతులు కాలువలో పడి ఉన్న పైపింగ్ ను చూసి నీటిపారుదల శాఖ అధికారులకు సమాచారం అందించారు. అంతకుముందు 2-3 అడుగులకే ఉన్న పైపింగ్ నీరు బయటకు వెళ్లడంతో కాలువ గట్టు 20 అడుగులకు పైగా వెడల్పుతో కుంగిపోయింది. కాలువ ద్వారా నీరు బయటకు వెళ్లి పంట నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న అధికారులు కాలువలో నీటి ప్రవాహాన్ని తగ్గించి మరమ్మతులు చేసే పనులు ప్రారంభించారు. ప్రాంతం ఇరుకుగా ఉండడంతో మరమ్మతు పనులు నిదానంగా సాగుతున్నాయి. మరమ్మతు పనులు ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. 350 క్యూసెక్కులకు పైగా నీరు బయటకు వెళ్లి పోతున్నాయి. తుంగభద్ర జలాశయం బోర్డ్ అధికారులు ఎగువ కాల్వకు వస్తున్న నీరు ప్రవాహాన్ని పూర్తిగా తగ్గించేశారు. గండి పడిన విషయాన్ని తెలుసుకున్న తుంగభద్ర బోర్డు సూపర్ డెంట్ ఇంజనీర్ శ్రీకాంత్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవిచంద్ర మరమ్మతు పనులను పరిశీలించి రేపు సాయంత్రం పనులు పూర్తి చేసి నీటిని విడుదల చేస్తామని తెలిపారు. ఇప్పటికే తుంగభద్ర జలాశయం నుంచి నీరు ఆలస్యంగా విడుదల అయ్యి ఆయకట్టుకు ఇంకా అధికారికంగా విడుదల కాకపోవడం వర్షాలు లేకపోవడం..ఈ సమయంలో గండి పడడం తీవ్ర నష్టం కలిస్తుందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

అభివృద్ధి ధ్యేయంగా పనిచేయాలి

- రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి కే.వి.ఉషాశ్రీచరణ్
- ఉమ్మడి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి : జెడ్పీ చైర్ పర్సన్ బోయగిరిజమ్మ
- ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయం చేసుకొని ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి : కలెక్టర్ యం.గౌతమి

విశాలాంధ్ర–అనంతపురం వైద్యం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల అభివృద్ధే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి కే.వి.ఉషాశ్రీచరణ్ ఆదేశించారు. శనివారం అనంతపురం నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కే.వి.ఉషాశ్రీచరణ్, జిల్లా కలెక్టర్ యం.గౌతమి, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, జాయింట్ కలెక్టర్ మరియు జిల్లా పరిషత్ సీఈవో కేతన్ గార్గ్, శ్రీసత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ టీఎస్.చేతన్, అసిస్టెంట్ కలెక్టర్ కుషాల్ జైన్, జడ్పి డిప్యూటీ సిఈఓ లలితాబాయి, తదితరులు పాల్గొన్నారు. అధికారుల దృష్టి ఉమ్మడి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేయాలని జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయం చేసుకొని ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ యం.గౌతమి తెలిపారు. ఈ సమావేశంలో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల డిఎంహెచ్వోలు డా.యుగంధర్, డా.కృష్ణారెడ్డి, డీఆర్డిఏ పీడీలు నరసింహారెడ్డి, నరసయ్య, ఐసిడిఎస్ పిడీలు శ్రీదేవి, లక్ష్మీ కుమారి, వ్యవసాయ శాఖ జేడీలు ఉమామహేశ్వరమ్మ, సుబ్బారావు, హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి, ఉమ్మడి జిల్లాలకు చెందిన వివిధ శాఖల జిల్లా అధికారులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్, చంద్రబాబు, అచ్చంనాయుడిపై చర్య తీసుకోండి

విశాలాంధ్ర–రాప్తాడు: టీడీపీలో నాయకులను, కార్యకర్తలను రెచ్చగొడుతున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుపై పోలీసు కేసులు నమోదు చేయాలని వైసీపీ సత్యసాయి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ షాషు (షాషావలి)అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషనులో రూరల్ స్టేషన్ సీఐ జి.రామ కృష్ణారెడ్డికి ఫిర్యాదు శనివారం ఫిర్యాదు చేశారు. జిల్లా కన్వీనర్ షాషావలి మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘథం కలిగించే విధంగా ఆయన ప్రసంగాలను చేస్తున్నాడని... అదేవిధంగా చంద్రబాబు నాయుడు కూడా బహిరంగ సభలలో పార్టీ నాయకుల్ని, కార్యకర్తలే కాకుండా ప్రజలను కూడా రెచ్చగొట్టే విధంగా ప్రసంగాలు చేయడం దారుణ మన్నారు. తంబళ్లపల్లి, పుంగనూరు మాచర్ల లాంటి సున్నితమైన నియోజకవర్గాల్లో అల్లర్లు జరగటం.. కేసులు పెట్టుకోవడం రాష్ట్ర ప్రజలం దరూ చూస్తూనే ఉన్నారన్నారు కార్యక్రమంలో రాప్తాడు నియోజకవర్గ సోషల్ మీడియా కో- కన్వీనర్ చంద్రశేఖర్, రూరల్ మండలం జేసీఎస్ ఇన్‌ఛార్జి శ్యాంసుందర్ శాస్త్రి, రామగిరి మండల కన్వీనర్ రమేష్, నాయకులు ధనుంజయ యాదవ్, పేరూరు మోహన్, ఇర్ఫాన్, మనోజ్ పాల్గొన్నారు..

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

విశాలాంధ్ర – జేఎన్టీయూ ఏ: నూతన ఆవిష్కరణలతో పారిశ్రామిక వ్యక్తులుగా ఎదగాలని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య సి.శశిధర్ పేర్కొన్నారు. శనివారం జేఎన్టీయూ మెకానికల్ ఇంజినీరింగ్ సెమినార్ హాలులో వరల్డ్ ఎంటర్ప్రెన్యూర్స్ డే కోఆర్డినేటర్ డాక్టర్ జి.మమత ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020, పారిశ్రామిక ఉజ్వల భవిత, ఉపాధి కల్పన, సాంకేతిక రంగం మార్పులను వేగవంత అధ్యయనంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నిపుణుడు కె.రాజశేఖరరెడ్డి పారిశ్రామిక అంశాలపై శిక్షణ ఇచ్చారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య ఇ.అరుణ కాంతి, డాక్టర్లు భువన విజయ, ఓం ప్రకాష్ పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా వంశీ

విశాలాంధ్ర–రాప్తాడు: అనంతపురం నగరంలో వికే మెమోరియల్ హాలులో జరిగిన ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా నిర్మాణ మహాసభల్లో ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులుగా వంశీ తో పాటు 23 మంది కార్యవర్గ సభ్యులు 45 మంది కౌన్సిల్ సభ్యులను ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు పి. నారాయణస్వామి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్ బాబు, శివారెడ్డి నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ మాట్లాడుతూ జిల్లాలో విద్యా రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీకి, సిపిఐ, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

ఫిజిక్స్ వాలా స్కాలర్ షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర – జెఎన్టియుఏ: విద్యను అభ్యసించాలని ఆశయం ఉన్న, ప్రతిభావంతులకు యూనికార్న్ ఎడ్ - టెక్ కంపెనీ ఫిజిక్స్ వాలా 6 నుండి 12వ తరగతి వరకు విద్యార్థులకు జేఈఈ, నీట్ విద్యార్థులకు నేషనల్ స్కాలర్షిప్ కు ప్రవేశ పరీక్ష చేపట్టి విద్యార్థులకు పిడబ్ల్యూఎన్ఎస్ఎటి విద్యార్థులకు 200 కోట్లు స్కాలర్షిప్‌ను అందించనున్నారు. ఆన్లైన్లో పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు అక్టోబర్ 15 చివరి తేదీగా నిర్ణయించారు. పరీక్ష ఫలితాలను అక్టోబర్ 20న ప్రకటించనున్నారు. ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిడబ్ల్యూ ప్రతినిధులు కోరారు.

జీతాల కోసం తాగునీటి సరఫరా.. కార్మికుల ఆందోళన

- న్యాయం జరిగే వరకు సమ్మె కొనసాగిస్తాం

విశాలాంధ్ర–ఉరవకొండ: తమకు రావలసిన జీతాలు, పిఎఫ్, గ్రాట్యూటీ మంజూరు చేసే వరకు కూడా సమ్మెను కొనసాగిస్తామని సత్య సాయి, శ్రీరాంరెడ్డి, తాగునీటి సరఫరా పథకంలో పనిచేసే కార్మికులు పేర్కొన్నారు. శనివారం ఉరవకొండ పట్టణంలో ర్యాలీ నిర్వహించి అనంతరం తాహసిల్దార్ కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులకు మద్దతుగా పాల్గొన్న సీఐటీయూ నాయకులు ఓబులు మాట్లాడుతూ సత్య సాయి,శ్రీరామ్ రెడ్డి తాగునీటి సరఫరా పథకంలో దాదాపు 600 మంది కార్మికులు గత 12 సంవత్సరాలుగా పనిచేస్తున్నారని అయితే వారికి సకాలంలో జీతాలు, పీఎఫ్ లు చెల్లించకుండా ప్రభుత్వము కాలయాపన చేస్తుందని దీనివల్ల కార్మికుల యొక్క బతుకుతెరువు భారంగా మారిందన్నారు. 600 మంది కార్మికులకు దాదాపు నాలుగు నెలలుగా జీతాలు, పిఎఫ్‌లు ఇవ్వకుండా కాల యాపన చేస్తున్నారని ఆరోపించారు. తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు.

రాష్ట్రాన్ని రక్షించండి..దేశాన్ని కాపాడండి

విశాలాంధ్ర–తాడిపత్రి: రాష్ట్రాన్ని రక్షించండి. దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సిపిఐ రాష్ట్ర సమితి ఈనెల 17వ తేదీ నుండి సెప్టెంబర్ 8వ తేదీ వరకు బస్సు యాత్ర ను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సి. జాఫర్ పిలుపునిచ్చారు. శనివారము ఆర్ అండ్ బి బంగ్లాలో బస్సు యాత్ర వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలులో విఫలమయ్యారన్నారు. బిజెపి ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రజా వ్యతిరేక విధానాల అవలంబిస్తూ ప్రభుత్వ ఆస్తులను ఎక్కడికక్కడ ప్రైవేట్ పరం చేస్తూ కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్నారన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రత్యేక హెూదా, రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీని గూర్చి మాట్లాడారు. కానీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి వాటిపై మాట ఊసే లేదన్నారు. సిపిఐ మండల కార్యదర్శి నాగ రంగయ్య పాల్గొన్నారు.

బస్సు యాత్రను జయప్రదం చేయాలి

విశాలాంధ్ర –రాయదుర్గం: రాయదుర్గం పట్టణంలోని వినాయక సర్కిల్ సీపీఐ ప్రచార బస్సుయాత్ర ఆగస్టు 17 నుండి సెప్టెంబర్ 8 వరకు జరిగే బస్సు యాత్రను జయప్రదం చేయాలని కరువు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ తాలూకా కార్యదర్శి ఎం నాగార్జున మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి నుంచి రాష్ట్రాన్ని రక్షించండి నరేంద్ర మోడీ నుంచి దేశాన్ని కాపాడండి పాలకులు నియంతలైతే ప్రజలు బానిసలుగానే. ఉండిపోవాల్సిందే అన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి కోట్రేష్, సీపీఐ సహాయక కార్యదర్శి గురుస్వామి, సీపీఐ నాయకులు నర్సింహులు, తిప్పేస్వామి, దుర్గన్న, మనోజ్, అమర్నాథ్ పాల్గొన్నారు.

సీతారామరెడ్డి నియామకం పట్ల హర్షం

విశాలాంధ్ర–ఉరవకొండ: టీడీడీ పాలక మండలి సభ్యుడిగా తన సోదరుడు వై.సీతారామిరెడ్డిని నియమించినందుకు ఎమ్మెల్సీ వై శివరామరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎల్లారెడ్డి కుటుంబం పట్ల నమ్మకం ఉంచి కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి సేవ చేసుకునే భాగ్యం కల్పించినందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని తెలియజేశారు. టీటీడి బోర్డు సభ్యుల నియామకంలో సామాజిక న్యాయాన్ని పాటించి ముఖ్యమంత్రి బడుగు, బలహీన వర్గాల పక్షపాతి అని నిరూపించు కున్నారన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర–రాప్తాడు: ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు సీఎం సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయాన్ని వైసీపీ ప్ర ప్రభుత్వం అందిస్తోందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తెలిపారు. రాప్తాడు నియోజకవర్గంలో పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే నివాసంలో శనివారం 30 మంది లబ్దిదారులకు రూ.34.43 లక్షల చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైయస్ జగన్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందన్నారు. రాష్ట్రంలో వైద్యం, విద్యకు పెద్దపీట వేస్తున్నారన్నారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

- ఏపీ రైతు సంఘం డిమాండ్



విశాలాంధ్ర–యాడికి: తాడిపత్రి నియోజకవర్గం వ్యాప్తంగా వర్షాలు లేక ఎండిపోతున్న పంటలను కాపాడాలని ప్రభుత్వం వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పెద్దవడుగూరు మండలంలోని అప్పేచెర్ల తిమ్మాపురం గ్రామాలలో శనివారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు సంఘం సీనియర్ నాయకులు సూర్యనారాయణ రెడ్డి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరాముడు యాదవ్ రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ఓపిరెడ్డి కార్యదర్శి ఆదినారాయణ యాదవ్ రైతు సంఘం నాయకులు రైతులతో కలసి పంట పొలాలను పరిశీలించారు. నియోజకవర్గంలో లక్ష ఎకరాలలో పత్తి ,వేరుశనగ, కంది, ప్రొద్దు తిరుగుడు, కోర్ర, సజ్జ, జొన్న తదితర పంటలు సాగు చేశారని, రెండు నెలలు పైబడి కావస్తున్న వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయి అన్నారు. ఎకరాకు రూ.25 వేలు నష్టపరి హారం చెల్లించాలని కోరారు. అస్తవ్యస్త పాలన ఎండగట్టేందుకే బస్సు యాత్ర చేపట్టామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నారాయణ స్వామి, సిపిఐ మండల సహాయ కార్యదర్శి పోల రంగస్వామి, సిపిఐ నాయకులు అల్లా బకాష్, శేష గోపాల్ పాల్గొన్నారు.

బిసి జిల్లా ఉపాధ్యక్షుడిగా రాళ్ల...

విశాలాంధ్ర–డి.హీరేహాళ్: గొడిశెలపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు రాళ్ల తిమ్మారెడ్డికి బిసి జిల్లా ఉపాధ్యక్షునిగా ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి నియమించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రాళ్ల తిమ్మారెడ్డి మాట్లాడుతూ బిసి జిల్లా ఉపాధ్యక్షునిగా తనను నియమించినందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డికి, మండల కన్వీనర్ వన్నూరుస్వామికి మరియు డి.హీరేహాళ్ మండల వైయస్ఆర్ కుటుంబ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 27, ఆగస్టు 2023

సమస్యల పట్ల అధికారులపై ప్రజాప్రతినిధుల ఫైర్

● అమడగూరు సర్వసభ్య సమావేశం రసాబాస

విశాలాంధ్ర-అమడగూరు: మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. పలు శాఖల అధికారులు మాట్లాడబోగ, ప్రజా ప్రతినిధులు లేచి మండలంలో ఏ ఒక్క ప్రభుత్వ అధికారి ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదని, విధులకు సక్రమంగా హాజరు కావడం లేదన్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ సత్యవతి బాధ్యతలను చేపట్టి ఐదు నెలలైనా ఆమెను చూడటం ఇదే మొదటిసారి అని, ఆమె మండలంలోని అంగన్వాడి సెంటర్లపై దృష్టి పెట్టడం లేదని, విధులకు ఎప్పుడొస్తున్నారో ఎప్పుడు వెళ్తున్నారో ఎవరికీ తెలియదని, తగు చర్యలు తీసుకుంటామని ఎంపీపీ ఆగ్రహించారు. విద్యుత్ శాఖ వారు ప్రజల దగ్గర ప్రజాప్రతినిధుల దగ్గర లక్షలాది రూపాయలు డిపాజిట్లు చేయించుకుని, వారికి సంబంధించిన సామగ్రిని అందజేయకుండా, గడప గడప కార్యక్రమంలో ఎం.ఎల్.ఎ. సైతం చెప్పినా వినకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజా ప్రతినిధులు కరెంట్ ఏఈపై ఆగ్రహించారు. జగనన్న ఇళ్ల నిర్మాణాల బిల్లులు, సిమెంట్ ఇవ్వడం పట్ల హౌసింగ్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వైసిపి ఎంపిటిసి నాగరాజు మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో అధికారులతో కొట్లాడి మరీ బిల్లులు చేయించుకున్నామని, మన వైసీపీ ప్రభుత్వంలో ఏ ఒక్క అధికారిని కొట్లాడిన ప్రయోజనం కలగలేదని, ప్రజల సమస్యలను ఎలా తీర్చాలన్నారు. డిప్యూటీ తాసిల్దార్ వెంకట రెడ్డి ఓట్ల జాబితాపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎం.పి.డి.ఒ. మునెప్ప, ఈ ఈ శామీర్ భాష, ఏపిఎం గోపాల్, ఏవో రమణాచారి, ఏపిఓ అమరావతి, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంఈఓజిలాన్‌భాష పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్..

- సర్పంచ్ లేకుండానే విచారణ చేసిన సీడీపీఓ తూతూ మంత్రంగా విచారణ
- అంగన్వాడీ కేంద్రంలో రికార్డులు తీసుకెళ్లినా పట్టించుకోని సీడీపీఓ

విశాలాంధ్ర-గోరంట్ల: గోరంట్ల మండలంలోని వానవోలు -1 అంగన్వాడి కేంద్రంలో ఆయా నుండి టీచర్ ప్రమోషన్ వివాదాస్పదంగా మారింది, గ్రామపంచాయతీ సర్పంచ్ శ్రీరాములు ఆధ్వర్యంలో గ్రామస్తులు సిడిపిఓ అనురాధకు మూడు లక్షలు లంచం చెల్లించి, ప్రమోషన్ తెచ్చుకుందని దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబుకు వినతి పత్రం అందజేశారు, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తిక్ కు విచారణ అధికారిగా నియమించారు, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తిక్ వివిధ సమావేశాలలో బిజీగా ఉండడంతో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్దకు వెళ్లి వచ్చిన సిడిపిఓ మరియు యూనియన్ నాయకులు అంగన్వాడి ఆయా ఎం శోభ లు, విచారణ పూర్తికాకుండానే విచారణ జరిపారని సిడిపిఓ అచ్యుత్సాహంతో వానవోలు గ్రామానికి చేరుకొని సర్పంచ్ శ్రీరాములు మరియు ఇతర ఫిర్యాదు చేసిన వారు కి సమాచారం అందించకుండా అంగన్వాడి సెంటర్ కు చేరుకొని గర్భిణీలు చిన్నారుల తల్లిదండ్రులతో మొక్కుబడిగా విచారణ జరిపి వేను దిరిగారు, ఈ విషయంపై సర్పంచ్ శ్రీరాములు మేము గ్రామంలో లేమని వేరే ఊరికి వెళ్ళామని కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా రావడం జరిగిందని సోమవారం విచారణకు రావాలని పూర్తి వివరాలు అందిస్తామని ఫోన్ ద్వారా చెప్పినా వినకుండా తూతూ మంత్రంగా విచారణ జరిపి ఆయా శోబా కు అనుకూలంగా గర్భిణీలు తల్లిదండ్రులతో పౌష్టికాహారం బాగా ఇస్తుందని సంతకాలు చేయించుకొని వెళ్లడం విశేషం, అయితే తనకు డబ్బులు ఎవరు ఇవ్వలేదని సిడిపిఓ చెప్పుకొచ్చారు, అంగన్వాడి కేంద్రంలోని రికార్డులు కూడా ఆయా ఎత్తుకెళ్లిందని సమాచారం అందడంతో విలేకరులు సిడిపిఓ ను ప్రశ్నించిన రికార్డుల సంగతి తనకు తెలియదని దాటవేశారు, అయితే ప్రమోషన్ విషయంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సిడిపిఓ అనురాధ ఫిర్యాదు చేసిన ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు లేకుండానే విచారణ జరిపి వెళ్లడం పలు అనుమానాలకు తావిస్తోంది, ఈ విషయంపై జిల్లా అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరపాలని సర్పంచ్ శ్రీరాములు ఫోన్ ద్వారా విలేకరులకు తెలిపారు. గ్రామానికి చెందిన గోపాలప్ప కూడా ఎవరూ లేరని విచారణ సోమవారానికి వాయిదా వేయాలని సిడిపిఓని కోరిన ఆమె పట్టించుకోకుండా విచారణ పూర్తి చేయడం పై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సీపీఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

విశాలాంధ్ర - సోమందేపల్లి: సోమందేపల్లి మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కూడలి నుంచి కొత్తపల్లి క్రాస్ వరకు ఉన్న డివైడర్లను తొలగించి రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించాలని శనివారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ప్రజల చేత సంతకాలు సేకరణ చేపట్టారు. సిపిఐ మండల కార్యదర్శి బాలస్వామి మాట్లాడుతూ గత పది రోజుల నుంచి సిపిఐ ఆధ్వర్యంలో సోమందేపల్లి మండలంలోని వెడల్పుగా ఉన్న డివైడర్ను తొలగించి రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించాలని, అధికారులకి సమర్పించ అయినప్పటికీ వినతి పత్రాలు సమర్పించాము. అయినప్పటికీ కూడా అధికారులు నిమ్మకు నీరు ఎత్తినట్టుగా వ్యవహరిస్తున్నారు. అధికారులు గనక వెడల్పుగా ఉన్న డివైడర్‌ని తొలగించకపోతే పెద్దఎత్తున రాస్తా రోకోలు ధర్నాలు చేసిన డివైడర్లను తొలగించే దానికోసం సిపిఐ పోరాడుతుంది. కార్యక్రమంలో సిపిఐ మండల కమిటీ సభ్యులు అల్లా బకాష్, పట్టణ కార్యదర్శి చాంద్ బాషా, ఆంజనేయులు, గంగరాజు నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సర్వేపల్లి రాధా కృష్ణ జీవన సాఫల్య పురస్కారం

విశాలాంధ్ర-పెనుకొండ : ఉపాధ్యాయుడు, కవి,రచయిత, గాయకుడు,సంపాదకుడు మరియు సామాజిక సేవా కార్యకర్త అయిన జాబిలి చాంద్ బాషా అలియాస్ జయచంద్రకు ఇంటర్ నేషనల్ ఐఎస్ఓ గుర్తింపు పొందిన మనం ఫౌండేషన్ వారు" సర్వేపల్లి రాధాకృష్ణ జీవన సాఫల్య పురస్కారం" అంతర్జాలం ద్వారా అందజేసారు. రొద్దం మండలం.కోగిర ఉన్నత పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సహకారంతో ఆర్‌డిటి వారి కోటి రూపాయల నూతన భవన నిర్మానంలో ప్రధానపాత్ర పోషించారు. తోటి ఉపాధ్యాయులు. దాతల సహకారంతో 80000 రూపాయాల వ్యయంతో పాఠశాలలో సరస్వతి విగ్రహాన్ని ఏర్పాటు చేసారు. అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నందున మిత్రులు తోటి ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు వెల్లువెత్తాయి.

హింసను ప్రేరేపిస్తున్న జగన్ సర్కార్

– జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్

విశాలాంధ్ర-బత్తలపల్లి: రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం హింసను ప్రేరేపిస్తోందని జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, నిడిగల్లు సర్పంచ్ గోనుగుంట్ల భూషణ్ (నాగభూషణ) పేర్కొన్నారు. శనివారం ఆయన బత్తలపల్లిలోని తెదేపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం నాలుగు సంవత్సరాల నుంచి ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాటి తెలుసుకునేందుకు తెదేపా నాయకుడు నారా లోకేష్ పాదయాత్ర చేస్తున్నాడని ప్రజల్లో వస్తుందని స్పందన చూసి ఓర్వలేక జగన్ అల్లర్లు సృష్టించడానికి తన కార్యకర్తలకు ఆదేశాలిస్తున్నారన్నారు.

యువగళం పాదయాత్రకు అనంత టీడీపీ నేతల సంఘీభావం

విశాలాంధ్ర-పెనుకొండ : ఉమ్మడి అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు శనివారం యువగలం రథసారథి నారా లోకేష్ పాదయాత్ర నూజివీడులో 195వ రోజు సందర్భాన్ని పురస్కరించుకొని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సవిత తో పాటుగా అనంత జిల్లా నేతలు తమ సంఘీభావాన్ని తెలుపుతూ పాదయాత్రలో పాల్గొన్నారు. సవిత లోకేష్ బాబుకి రాఖీ కట్టి, పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేసి రాజకీయ పరిస్థితులపై చర్చించారు. కార్యక్రమంలో రామాంజి నమ్మ, వెంకట శివుడు యాదవ్, దేవల మురళి, అంజనప్ప, శివబాల, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా సేవలు మరువలేనివి..

మదర్ థెరిస్సాకు నివాళులర్పిస్తున్న నాయకులు

విశాలాంధ్ర-కొత్తచెరువు: శాఖ గ్రంథాలయంలో మదర్ థెరిస్సా 111వ జయంతిని గ్రంథాలయ అధికారి జయరాం అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్లేష్ గౌడ్, అసిస్టెంట్ డైరక్టర్ వెటర్నరీ వారు హాజరై మదర్ తెరిస్సా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ మదర్ థెరిస్సా 20వ శతాబ్దపు గొప్ప మానవతావాదులలో ఒకరిగా పరిగణించబడుతుంది అని అన్నారు. హెచ్ఐవి/ఎయిడ్స్, కుష్టు వ్యాధి మరియు క్షయవ్యాధితో మరణిస్తున్న వ్యక్తుల కోసం ఈ సంఘం గృహాలను నిర్వహించారని, 1997లో ఆమె మరణించే సమయానికి, మిషనరీస్ ఆఫ్ ఛారిటీ ప్రపంచవ్యాప్తంగా 123 దేశాలలో 610 పునాదులతో - వేల మంది లే వాలంటీర్లతో పాటు - 4,000 కంటే ఎక్కువ మందిని కలిగి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సచివా లయ కార్యదర్శి సరేష్, అటెండర్ వెంకట రమణప్ప, స్వీపర్ మునీర్ పాఠకులు మహమ్మద్,రామాచారి, అమృతా,తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిసా జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి..

- విశ్వభారతి పాఠశాల ఛైర్మన్ రిజ్వాన్ భాషా

విశాలాంధ్ర-ధర్మవరం: మదర్ థెరిసా జీవితాన్ని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని విశ్వభారతి పాఠశాల ఛైర్మన్ రిజ్వాన్ భాషా తెలిపారు. శనివారం పట్టణంలోని విశ్వభారతి స్కూల్లో మదర్ తెరిసా 113 వ జన్మదిన వేడుకలను శనివారం విద్యార్థులు, ఉపాధ్యాయులు నడుమ ఘనంగా నిర్వహించారు. మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తదుపరి రిజ్వాన్ భాషా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సహాయం చేసే అలవాటను చేసుకోవాలని, మదర్ తెరిసా చెప్పిన "ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న" అన్న వాటిని తప్పనిసరిగా అమలు చేయాలని తెలిపారు. తదుపరి అధ్యాపకులు మదర్ తెరిసా జీవితాన్ని విద్యార్థులకు తెలియజేశారు.

సీఎంఓ చొరవతో ఆగిన బాల్య వివాహం..

విశాలాంధ్ర-పుట్టపర్తి : సీఎమ్ఓ ఆదేశాలతో శనివారం పోలీస్ యంత్రాంగం బాల్యవివాహాన్ని ఆపివేసింది. ఓ మైనర్ బాలిక విన్నపానికి ముఖ్యమంత్రి కార్యాలయం సమాచారం ఇవ్వగా, సీఎం ఓ కార్యాలయం వెంటనే జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. ఎన్పి కుంటమండలం, తిమ్మమ్మ మర్రిమాను గ్రామానికి చెందిన బాలిక(14) తన తండ్రి తనకి ఇష్టం లేని పెళ్లి చేస్తున్నాడని, తన ఆధార్ కార్డులో వయస్సుని మార్పు చేసి వివాహం చేయడానికి ప్రయత్నం చేస్తున్నా డని, చదువుకుంటాను అని ఎంత చెప్పినా వినకుండా 27వ తేదీన వివాహానికి ఏర్పాట్లు చేశాదని సీఎంఓ కార్యాలయా నికి సామాజిక మాధ్యమాల ద్వారా పం పింది. స్పందించిన సీఎంఓ కార్యాలయం ఎస్పీ మాధవ్ రెడ్డికి బాలిక వివరాలు పంపి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఆయన ఆదేశాలతో స్థానిక పోలీస్ సిబ్బంది, ఎంపీడీవో, ఐసీడీఎస్ అధికారులు బాలిక స్వగ్రామానికి వెళ్లి వివాహం నిలిపి వేశారు. బాలిక తల్లిదండ్రులు, పెళ్లి కుమరుడు, తల్లిదండ్రు లకు కౌన్సిలింగ్ నిర్వహించారు.

80 శాతం సబ్సిడీతో రైతులకు ఉలవలు

విశాలాంధ్ర-అమడగూరు: మండలంలోని రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం ఉలవలు 80 శాతం సబ్సిడీతో అందించబడునని, మండల అగ్రికల్చరల్ ఆఫీసర్ రమణాచారి తెలిపారు. ఉలవలు ఒక క్వింటాల పూర్తి ధర 10,800 కాగా సబ్సిడీ రూ.8,640 పోగ రైతు వాటా 2,160 రూపాయలు మాత్రమేనని కావలసిన రైతులు వారికి సంబంధించిన ఆర్‌బికె కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, పంటను వేసిన ప్రతి రైతు ఈ-పంట నమోదు చేయించుకోవాలని, అలా నమోదు చేయించుకున్న వారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని తెలియజేశారు.

టిడిపిని ఆదరించండి

విశాలాంధ్ర-కొత్తచెరువు: 2024 లో జరిగే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి చేయాలని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తెలిపారు. మండల పరిధిలోని మీర్జాపురం కొత్త దేవరపల్లి, పాత దేవరపల్లి, బంగారు చెన్నేపల్లి గ్రామాలలో మహాశక్తి రథం ద్వారా గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటా తిరిగి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. వైసీపీ పాలనలో ప్రజలు విసుకు చెందారని రాష్ట్రాన్ని అప్పులు పాలు చేశారన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే సంపాదన సృష్టించే అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, టిడిపి నాయకులు సురేష్, సుబ్రహ్మణ్యం, అంజన్ రెడ్డి, కేసప్ప, సుధాకర్, మాధవి, రాధ, తులసి తదితరులు పాల్గొన్నారు.

పవిత్రోత్సవ, సుదర్శన హోమం విజయవంతం చేయండి

- శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణములోని కొత్తపేటలో గల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో పవిత్రోత్సవ సుదర్శన హెూమాల కార్యక్రమాలలో భక్తాదులు పాల్గొని విజయవంతం చేయాలని, శ్రీ గణపతి సచ్చిదానంద జ్ఞానబోధ సభ ట్రస్ట్ సభ్యులు మెటీకల కులాయప్ప, బెస్త దత్త శివ, శంకర సంజీవులు, ప్రధాన అర్చకులు సుదర్శన చార్యులు, సునీల్ కుమారాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి ఆశీస్సులతో ఈనెల 30వ తేదీ నుండి సెప్టెంబర్ 1వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ కార్యక్రమాలు ఉంటాయని వారు తెలిపారు. 30వ తేదీ బుధవారం సాయంత్రం 6:30 గంటలకు అంకురార్పణ, 30 ఒకటవ తేదీ గురువారం ఉదయం 9 గంటలకు మహా సుదర్శన హెూమం, సెప్టెంబర్ ఒకటవ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు మహా పూర్ణాహుతి అనే కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. సుదర్శన యాగం ఈనెల 31వ తేదీన నిర్వహిస్తామని, యాగంలో పాల్గొన్న వారికి మంచి జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బిల్లే నాగప్ప, సాగా సురేష్, గుద్దిటి రామాంజనే యులు, రంగా శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుకు దరఖాస్తు చేసుకోండి..

విశాలాంధ్ర-కొత్తచెరువు: ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో పది సంవత్సరాలు పైబడి పని చేసిన ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం ఆగస్టు 29వ తేదీ లోపల జిల్లాలోనే ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో మీనాక్షి తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాథమిక ఉన్నత మండల ప్రాథమిక పురపాలక ఏబిఎం ఎస్, కేజీబీవీ, ఏపీ ఆర్ ఎస్ ఈ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు జిల్లాస్థాయి అధికారి కార్యాలయంలో దరఖాస్తు పూర్తి చేసి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలని ఆమె తెలిపారు.

ఉచిత మెగా హెల్త్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి..

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు..కలవల మురళీధర్



విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని తేరు బజారులో గల ఆర్యవైశ్య కొత్త సత్రంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘము రోటరీ క్లబ్ ధర్మవరం ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కలవల మురళీధర్, కార్యదర్శి కాకుమాని విద్యాసాగర్, ట్రెజరర్ ఓ.వి. ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం కలవల మురళీధర్ మాట్లాడుతూ పేద ప్రజల కోసం పట్టణ గ్రామీణ ప్రాంత వాసులకు ఇది ఒక సదవకాశమని తెలిపారు. అనుభవజ్ఞులైన వైద్యులు సూర్యనారాయణ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, వెంకటరెడ్డి, కుళ్లాయప్ప, కిరణ్, మహేష్ సురేఖ లచే వైద్య చికిత్సలను అందించడంతోపాటు మందులు కూడా ఉచితంగా పంపిణీ చేయబడును తెలిపారు. పురుషులు స్త్రీలు పిల్లలకు సంబంధించిన అన్ని రకాల జబ్బులకు ఉచితంగా చూడబడునని తెలిపారు. ప్రజలందరూ ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతులుగా ఉండాలని వారు కోరారు. మరిన్ని వివరాలకు కలవల మురళీధర్ సెల్ నెంబర్ 9848531302కు గాని కే. నరేందర్ రెడ్డి 9059990925 కు సంప్రదించాలని తెలిపారు.

సత్యసాయి తాగునీటి పథకం కార్మికుల ధర్నా

మోకాళ్లపై నిరసన తెలుపుతున్న కార్మికులు

విశాలాంధ్ర-ముదిగుబ్బ: వేతనాల చెల్లించాలని కోరుతూ సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు రెండవ రోజు శనివారం ముదిగుబ్బ మండల కేంద్రంలోని సత్యసాయి పంప్ హౌస్ ఎదుట వినూత్నంగా నిరసన చేపట్టారు ఐదు నెలలుగా పెండింగ్లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి కార్మికుల ఆధ్వర్యంలో రాజశేఖర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, రత్నం, ధర్మనాయక్,కృష్ణా నాయక్,గంగాధర, గోపాల్, రమేష్, అల్లి, తదితరులు పాల్గొన్నారు.

పొలాలకు సాగునీరు విడుదల చేయించిన రాచం రెడ్డి భాస్కర్ రెడ్డి..

విశాలాంధ్ర బుక్కపట్నం.. జిల్లాలోనే అతిపెద్ద చెరువు అయినా బుక్కపట్నం చెరువు కింద రైతుల పంట పొలాలు బోరు బావుల ద్వారా, సాగు చేసుకుంటుండగా సాగునీరు లేక రైతుల తీవ్ర ఇబ్బందులు పడుతూ పంటలు ఎండిపోతున్న తరుణంలో చెరువు తూము ద్వారా సాగు కాలువలకు నీరు విడుదల కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సందర్భంలో రైతులు స్థానిక పంచాయతీరాజ్ డిఇ భాస్కర్ రెడ్డికి దృష్టికి తీసుకువెళ్లి పంట పొలాలకు వదలాలని కోరగా వెంటనే స్పందించి రైతులతో కలిసి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డితో మాట్లాడి రైతులను నష్టపోకుండా పోకుండా కోరారు వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రైతుల సౌకర్యం కోసం నీరు వదలాలని స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి శ్రీలత గోవర్ధన్ రెడ్డి, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే సర్వసభ్య సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న మండలాధ్యక్షురాలు

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ మండల సర్వసభ్య సమావేశం శనివారం మండల పరిషత్ సమావేశ భవనము నందు మండల అధ్యక్షులు గీతా రామ్మోహన్ రెడ్డి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులు సర్పంచ్లు ఎంపీటీసీలు హాజరైనారు. సమావేశాన్ని ఉద్దేశించి ఎంపీపీ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికారులు అందు బాటులో ఉండాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం అంకితభావంతో పనిచేసిన అవసరం ఉన్నదని, కావున ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉన్నదని ఆమె తెలిపారు. ప్రతి కార్యాలయ వారిగా ప్రభుత్వం నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శివ శంకరప్ప, వైస్ ఎంపీపీ రామాంజినప్ప, డి ఈ వెంకటరమణ, అధికారులు పాల్గొన్నారు.

సీఐ యతీంద్రను మర్యాదపూర్వకంగా కలిసిన తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి తుమ్మల మనోహర్

విశాలాంధ్ర-ముదిగుబ్బ: ముదిగుబ్బ సర్కిల్ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన యతీంద్రను తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి తుమ్మల మనోహర్ ఆధ్వర్యంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలతో సత్కరించారు. అనంతరం మండలంలో జరుగుతున్న విషయాలను సీఐ దృష్టికి తీసుకు వచ్చారు. తెదేపా నాయకులు గణపర్తి నాయుడు, అంజి ఉన్నారు.

In The Court Of The Senior Civil Judge : Dharmavaram
I.A. 66/22 O.S. 41/2018

Between :
D. Chenna Reddy .... Plaintiff
And
D. Krishna Reddy (died) by L.R.S. ..... Defendent

Notice to Respondent

పై దావాలో D.Chenna Reddy @ nadipi Chenna Reddy S/o late. Gangi Reddy, Nelakota (v) Dharmavaram (m) అను వారు అతని తమ్ముడు డి. క్రిష్టారెడ్డి మరియు సి.మోహన్ వారిపై భాగ పరిష్కారం కొరకు దావా వేసి యున్నారు. ఈ దావాలో డి.క్రిష్టారెడ్డి మరణించడం వల్ల అతని వారసులను చేర్చుటకు పై అర్జీ కోర్టులో పెట్టియున్నారు. అందులో ప్రతివాది నెం.4 మరియు 6 C D.Udaya Sree D/o late Krishna Reddy W/o Madhu Sudhana Reddy R/o Mudigubba (T&M) eTJjáTT D.Manorama D/o late Krishna Reddy, Nelakota (v) Dharmavaram (m) ఈ వీరి హాజరు నిమిత్తం 04-09-2023వ తేది వాయిదా ఉన్నది. ఆరోజు అనగా 04-09-2023 మీరు కాని, మీ వకీలు ద్వారా గాని ఉదయం 10-30గంటలకు హాజరు అయి మీ వాదనలు తెలుపుకొనవచ్చును. అట్లు హాజరు కానియెడల మీ పరోక్షమున కేసు తీర్మానించడము జరుగుతుంది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది ; 04-09-2023

A.KRISHNA MOHAN,
Advocates, DHARMAVARAM